# రైలు

రాత్రి 11–30 అయింది.

కిటికీవద్ద నిలబడి దూరంగా కనబడుతున్న గూడ్సుబండినే చూస్తున్నాడు జగపతి.

చీకట్లో నల్లగా–దీపాలు లేక–నీడలా కదలిపోతూంది మలుపుతిరిగే వరకూ చూసి మెల్లగా వచ్చి కుర్చీలో కూచున్నాడు జగపతి.

ఆ గది అతని హృదయానికి ప్రతిబింబంలా ఉంది. చీకటిని పారద్రోలడానికి విశ్వప్రయత్నం చేస్తున్న నైట్‌ల్యాంపు–అతని మదిలో ఆశలా ఉంది. ఆ చీకటి–అతని మదిలో అలముకున్న అశాంతిలా ఉంది.

అతనికి చిన్నప్పుడు చదువుకొన్న యింగ్లీషుపద్యం గుర్తువచ్చింది. అందులో–ఏమీ తెలియని పసివాడు తన తల్లిని అడుగుతాడు. "అమ్మా! నేను రోజూ యిన్నిరైళ్ళు చూస్తూంటాను. కొన్ని దీపాలతో, కిటికీలతో అందంగా ఉండి–ఆనందంగా సాగిపోతాయి. మరి కొన్ని దీపాలు లేక–చీకటిలో నిశ్శబ్దంగా నడుస్తుంటాయి. అమ్మా! యివన్నీ ఎక్కడికిపోతాయి?" అని.

జీవితాలు కూడా అంతే.

కొందరి జీవితాలు–కష్టాలనేవే లేక–సంతోషంగా గడిచిపోతాయి. వారికి అంతా వెలుతురే

మరికొందరి జీవితాలు దుఃఖంతో–భారంగా గడిచిపోతాయి. వారి కెటు చూచినా చీకటే–తనలాగా.

రైళ్ళలో ఎందరో మనుషులు ఎక్కుతారు. ఎందరో దిగుతారు. జీవితంలో ఎందరో వ్యక్తులు కలుస్తారు. ఎందరో విడిపోతారు. ప్రాణప్రదంగా ప్రేమించిన వ్యక్తి విడిపోతే–ఆ బాధ తనకు బాగా అనుభవం

జగపతి ఆలోచిస్తున్నాడు.

అతనికి 'చైతన్య' గుర్తుకు వచ్చాడు.

అతని కళ్ళు చెమర్చాయి.

చైతన్య!

ఎంత గారాబంగా పెంచాడు వాడిని! వాడు పుట్టగానే తనలో ఏదో చైతన్యం వచ్చింది. అందుకే చైతన్య అని పేరు పెట్టాడు వాడికి.

అయిదేండ్లదాకా అడుగు కింద పెట్టనియ్యకుండా ఎత్తుకు పెంచాడు. కాని—

వాడిలా చేస్తాడనే ఊహ తనకు రానేలేదు. అసలు వాడు–తననుంచి విడిపోతాడని ఊహించనేలేదు. జగపతికి ఆనాటి దృశ్యం జ్ఞాపకం వచ్చింది.

ఆనాడు—

"నేనీ పెళ్ళికి అంగీకరించను" అన్నాడు తాను.

పవని. రా. భానుమూర్తి

"ఏం? రూపకేం తక్కువయింది? చదువులేదా? రూపంలేదా? అందం, చదువు, గుణం అన్నీ ఉన్న రూపకేం తక్కువయింది నాన్నా! మన కులం కాదనేగా?" అన్నాడు చైతన్య.

"అవును చేతన్! మన కులం కాని అమ్మాయిని నువ్వు చేసుకుంటే మన జమీందారీ పరువు ప్రతిష్ఠలేంకావాలి? డబ్బు లేకపోయినా నా కంగీకారమే—కానీ మన వంశమర్యాదకు యేమాత్రం భంగం కలిగినా నేను సహించను చేతన్!" ఆవేశంగా అన్నాడు తాను.

"నాన్నా! మీరు పెద్దవారు. అన్నీ తెలిసినవారు. మీరిలా ఆవేశపడడం భావ్యంకాదు. కులాలు మనిషి సృష్టించుకున్నవి. పుట్టగానే మీరూ ఏడ్చారు. నేనూ ఏడ్చాను. అందరూ ఏడుస్తారు. ఆనందమైతే మీరూ నవ్వుతారు. నేనూ నవ్వుతాను. అందరూ నవ్వుతారు. మీరు గొప్ప వంశస్థులనీ, అగ్రకులం వారనీ—వారు నీచకులాల వారనీ నవ్వుకూ—ఏడుపుకూ లేని తేడా మనిషికెందుకు నాన్నగారూ?"

"చేతన్! నీవు పిల్లవాడివి. నీకు తెలియదు. గడ్డిపువ్వూ గులాబీ రెండూ నేలమీదే పూస్తాయి. అంతమాత్రాన రెండూ ఒకటే అంటావా?"

"కాదు నాన్నగారూ! గులాబీని అందరూ ముద్దుగా చూసుకుంటారు. తలలో ముడుచుకుంటారు. అయినా గులాబీ పువ్వు దగ్గరికి కెళితే ముళ్ళు గుచ్చుకుంటాయి. గడ్డిపువ్వును అందరూ హేళనగా చూస్తారు. కాలితో తొక్కి నలిపేస్తారు. అయినా అది ఓర్పుతో సహిస్తుంది. అందుకే-గులాబీ కంటే గడ్డిపువ్వే గొప్ప నాన్నగారూ!" ఆవేశంగా అన్నాడు చైతన్య.

జగపతికి చాలా కోపమొచ్చింది

"చేతన్! నువ్వెన్ని చెప్పినా నేనీ పెళ్ళికి అంగీకరించను. నీకూ, నాకూ మధ్య ఏవిధమైన సంబంధమూ లేదనుకుంటే—నీ యిష్టం?" అన్నాడు తాను.


"అలాగే నాన్నగారూ! మనిషి కంటే కులం గొప్పదనుకునే మీరు ఏ నాటికైనా నిజం గ్రహిస్తారు. ఏనాటికైనా నన్ను తిరిగి మీరే ఆహ్వానిస్తారు. అంతదాకా నేనీ యింటికిరాను," అంటూ వెళ్ళిపోయాడు చైతన్య.

వాడు వెళ్ళిపోయి రెండు సంవత్సరాలయింది.

వాడిని గురించిన విషయాలు తాను తెల్సుకుంటూనే ఉన్నాడు. యిప్పుడో బాబట—

వాడు వెళ్ళిపోయాక ఎంత బాధను భవించాడు తాను! నష్టపోయింది తానే నేమో! జగపతి కళ్ళనుండి రెండు నీటి చుక్కలు రాలాయి.

నిజమే! వాడు చెప్పినట్టు మనిషి కన్నా కులమే గొప్పదనుకున్నాడు అప్పుడు తాను!



కానీ మొన్నటిదాకా నిజం గ్రహించలేకపోయాడు.

మొన్న—

కృష్ణవేణికి చాలా సీరియస్‌గా తయారయింది.

మొదలే చాలా బలహీనపు మనిషి.

కొడుకు దూరమయ్యాక బెంగతో మంచంపట్టింది. త్వరత్వరగా హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు. డాక్టర్లు పరీక్షించి బ్లడ్ తక్కువయిందన్నారు.

తనరక్తం చూశారు.

సరిపోలేదు.

తనకేమీ పాలుపోలేదు.

పక్కనే ఉన్న పాలేరు రామునివంక దీనంగా చూశాడు.

"బాబూ!నా రగతం సరిపోతాదేమో! సూడమనండి బాబూ!" అన్నాడు వాడు.

'నీదా !?' అన్నాడు జగపతి ఆశ్చర్యంగా

"అవును బాబూ! యిన్నాళ్ళనుంచీ మీకాడ పనిచేస్తున్నాను. ఆ యమ్మ సల్లనితల్లి. ఆ యమ్మను సూస్తే గుండె తరుక్కుపోతా ఉండాది. తొరగా

సూదమనంది బాబూ?" అన్నాడువాడు-వాడి గొంతులో ఏడుపు జీర.

వాడి కళ్ళల్లో నీటిపొరలు చూచి చలించిపోయాడు తాను! యింతకాలం తాను చీకట్లో ఉన్నాడేమో అనిపించింది! డాక్టర్లు టెస్టుచేశారు.

కృష్ణవేణికి రాముడి రక్తం సరిపోయింది!

బ్లడ్ యిచ్చి పడుకోనున్న రాముడి వద్ద కెళ్ళాడు జగపతి.

"రాముడూ! నా కళ్ళు తెరిపించావురా! యింతకాలం కులం తక్కువవాడని నిన్ను చులకనగా చూశాను. కులంకంటె గుణం గొప్పని నాకు తెలియజెప్పావురా !" అన్నాడు తాను కళ్ళనుండి నీళ్ళు కారుతుంటే.

"బాబుగారూ! యింతకాలంనుంచి నా కన్నమేస్తా ఉండారు. మీకీమాత్రం చేయకుంటే నేనేటికి బాబూ!" అన్నాడు వాడు.

"రాముడూ ! ఈ రోజే చేతన్‌కి ఉత్తరం రాస్తున్నాను. రూపనూ, బాబునూ కూడా తీసుకురమ్మని రాస్తున్నాను." ఆనందంగా అన్నాడు తాను.

రాముడి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"నిజంగానా బాబూ! ఎంత శుభవార్త సెప్పారు!" అన్నాడు వాడు.

అన్నట్టుగానే చేతన్‌కి జాబువ్రాశాడు తాను.

రేపు వస్తాడు వాడు!

తప్పకుండా వస్తాడు!

ఎక్కడో పన్నెండు గంటలు కొట్టిన శబ్దం వినిపించింది.

జగపతి మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

*　*　*

మరునాడు——

జగపతి బాబుతో ఆడుకుంటూ తన గదిలో కూర్చున్నాడు. పక్కగదిలో కొడుకూ-కోడలూ సంతోషంగా నవ్వుకుంటున్నారు. బాబు ముద్దు ముద్దుగా చేతులు తిప్పుతూ-నవ్వుతున్నాడు.

"కూ........." అని కూత వినిపించింది.

బాబును మంచంపై వదిలి కిటికీవద్ద కొచ్చి చూశాడు జగపతి.

గూడ్సుబండి కాదు—పోతూ ఉన్నది. దీపాలు వెలుగుతూన్న రైలుబండిపోతూ కనిపించింది. జగపతి ఆనందంగా యిటుతిరిగి చూశాడు. ముసిముసి నవ్వులు నవ్వుతూ బాబు ఆడుకుంటున్నాడు.

———